క్లుప్తంగా

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

డెంకాడ: గర్భిణులు, బాలింతలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కొన్ని రకాల వ్యాధులను నివారించవచ్చని డెంకాడ పీహెచ్‌సీ డాక్టర్ భవాని అన్నారు. పీహెచ్‌సీలో మాతృ మరణాలు నివాణే లక్ష్యంగా కిల్కారి సేవలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు వివరించడంతో పాటు వైద్య పరీక్షలపై వివరించారు. వేసవి కావడంతో ప్రజలు జ్వరాలు, డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ యాసయ్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న వైస్ ఎంపీపీ, సీడీపీఓ

డెంకాడ: మండలంలోని చింతలవలస గ్రామంలో ఐసీడీఎస్ అధికారులు పోషణ పక్వాడా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనిలో గర్భిణులు, బాలింతలు, ఇతర తల్లులు, కిషోర్ బాలికలకు పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఎలాంటి పదార్థాల్లో ఎలాంటి పోషక విలువలు ఉంటాయన్నది వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, భోగాపురం ఐసీడీఎస్ సీడీపీఓ టి.ఎస్తేరాణి తదితరులు తిలకించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎ.సత్యవతి, శైలజ, రాణి, శశికళ, మహిళా పోలీస్ గౌరి, సుభాషిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అమ్మవారి ప్రసాదం భక్తులకు అందేలా చూడాలి



అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులను అడిగి తెలుసుకుంటున్న ట్రస్ట్ బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: అమ్మవారి అన్న ప్రసాదాన్ని భక్తులందరికీ అందేలా చూడాలని పైడితల్లి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు డాక్టర్ ఎస్.అచ్చిరెడ్డి, పతివాడ వెంకటరావు, సురేష్ తాడి పేర్కొన్నారు. ఈ మేరకు అమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాద పంపిణీని మంగళవారం వారు పరిశీలించారు. నాణ్యత పాటిస్తున్నారో లేదా అని ప్రసాదాన్ని స్వీకరించడమే కాకుండా భక్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మెంటాడ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మండల గృహసారథుల కన్వీనర్ కనిమెరక త్రినాథ్ కోరారు. మంగళవారం మండలంలోని మెంటాడ, లోతుగెడ్డ, ఆండ్ర గ్రామ సచివాలయాల్లో వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమైన ఆయన ఈ నెల ఏడో తేదీ నుంచి జరిగే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. 2024 ఎన్నికల్లో మళ్లీ పార్టీ అధికారమే లక్ష్యంగా చేపట్టే ఈ కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ కిట్లు పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీపీ ఆర్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

40 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు



వ్యవసాయ యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: రైతులకు 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు వెళ్లిన వారు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. అనంతరం వాటి గురించి సమగ్ర సమాచారం వ్యవసాయ విస్తరణాధికారి దమయంతిని అడిగి తెలుసుకున్నారు. తొలుత రైతు 10 శాతం వాటాను పెట్టుబడిగా పెడితే 50 శాతం రుణం, 40 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. ఇక్కడ ట్రాక్టర్, బుల్ రోటోవేటర్, చాఫ్‌కట్టర్, 12 ప్లేట్ల డిస్క్, హారో వంటి పరికరాలు ఉన్నాయని, సీహెచ్‌సీ గ్రూపులకు వీటిని మంజూరు చేయనున్నామని పేర్కొన్నారు.

మహిళల సంతోషమే సీఎం లక్ష్యం



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



హాజరైన మహిళలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- నియోజకవర్గంలో 41,526 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ.30 కోట్ల సాయం
- అట్టహాసంగా మూడో విడత ఆసరా సంబరాలు

విజయనగరం:

అర్హతే ప్రామాణికంగా.. అక్క చెల్లెమ్మల ఆనందం, సంతోషమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. విజయనగరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి విచ్చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యుల సమక్షంలో అట్టహాసంగా సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అక్క చెల్లెమ్మలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే, రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ మూడో విడతలో భాగంగా విజయనగరం పట్టణంలోని 3,381 గ్రూపులకు చెందిన 33,113 మంది సభ్యులకు రూ.24.90 కోట్లు, గ్రామీణ ప్రాంతంలోని 794 గ్రూపులకు చెందిన 8,413 మంది స్వయంసహాయక సంఘాల సభ్యులకు రూ.5.15 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. మొత్తంగా 4,175 గ్రూపులకు చెందిన 41,526 అక్క చెల్లెమ్మల ఖాతాల్లో రూ.30.05 కోట్లు జమ అయ్యాయని పేర్కొన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తద్వారా ఆర్థిక స్వావలంబన కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అందే ప్రతి పథకం తాలూక ఫలాలను పేదలకు అందించటంలో అధికారుల సహకారం అభినందనీయమని, ముఖ్యంగా సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు.

రాష్ట్రంలోనే మొదటి మహిళా పార్కు

మహిళల సంక్షేమం, ఆరోగ్యం, సంతోషమే లక్ష్యంగా నియోజవర్గంలో పలు సేవలు అందిస్తున్నామని దానిలో భాగంగా స్థానిక మున్సిపల్ ఆఫీస్ సమీపంలో మహిళలకు ప్రత్యేకంగా పార్కు నిర్మిస్తున్నామని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని స్వామి తెలిపారు. పార్కులో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్,



వినాయక నృత్యంలో చిన్నారులు

ఇతర వసతులతో పాటు స్విమ్మింగ్ పూల్ వసతి కూడా కల్పిస్తున్నామని చెప్పారు. బహుశా రాష్ట్రంలోనే మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన పార్కు మనదే అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన పలువురు లబ్ధిదారులు తమ సంతోషాన్ని వేదికపైకి వచ్చి పంచుకున్నారు. చివరిగా కంటి వెలుగు పథకంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా పలువురు విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. ఆసరా వేడుకల్లో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసారపు రేవతి దేవి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, మెప్మా పీడీ సుధాకర్, ప్రత్యేక అధికారి అరుణకుమారి, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, అధిక సంఖ్యలో స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంతృప్తినిచ్చే పథకం



మహిళలందరికీ సంతృప్తినిచ్చింది ఆసారా పథకం. గత రెండేళ్లలో వచ్చిన ఆసారా పథకం డబ్బులతో ఫ్యాన్సీ దుకాణం పెట్టుకున్నాను. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాను. ఇచ్చిన మాట తప్పకుండా హామీలను అమలు చేసే జగనన్న మళ్ళీ మళ్లీ సీఎంగా ఉండాలి.

– లక్ష్మి, చెల్లూరు గ్రామం, విజయనగరం మండలం

పారదర్శకత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలోని పారదర్శకత పట్ల మహిళా లోకం హర్షిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు ప్రతి పథకానికి సంబంధించిన లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయటం గొప్ప సంస్కారమని గర్వంగా చెబుతున్నా.

– సంగీత, 14వ డివిజన్, విజయనగరం కార్పొరేషన్

ముగిసిన శంకుస్థాపన వారోత్సవాలు



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

- 6 నుంచి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ వారోత్సవాలు
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని శంకుస్థాపన వారోత్సవాలలో భాగంగా 2.70 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. శంకుస్థాపన వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివేకానంద కాలనీ, చెంచుల కాలనీ ప్రాంతాలలో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిమిత్తం 2.70 కోట్ల రూపాయలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు పూర్తి చేశామన్నారు. అవి వెనువెంటనే పూర్తయ్యే విధంగా చూస్తామన్నారు. ఈ నెల ఆరో తేదీ నుండి ప్రారంభ వారోత్సవాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పూర్తయిన పనులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ప్రజలకు తాగునీరు, మౌలిక సదుపాయాలు, లైట్లు, రహదారులు వంటివి కల్పిస్తూనే నగర ప్రధాన జంక్షన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 6వ తేదీన ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ఉప్పు సత్యాగ్రహం స్మారకంగా దండి మార్చ్ విగ్రహాలను మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ స్థాయికి తగ్గ హంగులను తెచ్చేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంకా మౌలిక సదుపాయాల అవసరమైతే కార్పొరేటర్ ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. శంకుస్థాపన వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం రూ.60 లక్షలతో నగరంలోని 43, 44 డివిజన్‌లలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, జోనల్ ఇన్‌చార్జిలు డాక్టర్ వీఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్లు దాసరి సత్యవతి, సైలాడ సత్యనారాయణ, వంతరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్న కోలగట్ల



ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: గాజులరేగ ముత్యాలమ్మ తల్లి, పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అభిలాషించారు. గాజులరేగలో వేంచేసియున్న శ్రీముత్యాలమ్మ తల్లి, శ్రీ పైడితల్లి అమ్మవారి 70వ జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కమిటీ నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు అందజేశారు. ఆయన వెంట కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీ దేవి, కార్పొరేటర్‌లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, గాజులరేగ పిఎసిఎస్ అధ్యక్షులు జమ్ము మధు, పార్టీ నాయకులు కనుగుల రాజా, పాండ్రంకి గణేష్, అట్టాడ శ్రీను, జామాన శ్రీను, బూడి శ్రీను పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల సేవాభావంతో మెలగాలి



పోస్టల్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి ప్రమీలాదేవి

పూసపాటిరేగ : వృద్ధులు పట్ల ప్రతి ఒక్కరు సేవాభావంతో మెలగాలని పూసపాటిరేగ వైద్యాధికారి ఎస్.ప్రమీలాదేవి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్పేజ్ ఇండియా ఆధ్వర్యంలో వృద్ధులకు హెల్ప్‌లైన్ నంబరు 14567 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులను హింసించిన ఇంటి నుండి గెంటి వేయబడిన వారికి రక్షణ ఏర్పాటు చేస్తారన్నారు. పెన్షన్ చట్టపరమైన సమస్యలపై సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు అన్నారు. వృద్ధాశ్రమాలు, సంరక్షణ కేంద్రాల పట్ల సమాచారం ఇస్తాన్నారు. కార్యక్రమంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ఫీల్డు రెస్పాన్స్ అధికారి జి. సింహాచలం, సీహెచ్‌ఓ వేమణి, హెల్త్ ఎడ్యుకేటర్ రామలక్ష్మి, సిబ్బంది ఆర్‌వి.రమణ, గణపతి, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

విజయనగరం: నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఆర్ అండ్ బీ జంక్షన్‌లో థెరిస్సా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి ఏడాది మాదిరిగానే వేసవిలో పాదచారులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారి దాహార్తిని తీర్చటంలో భాగంగా స్థానిక ఆర్అండ్‌బీ జంక్షన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని క్లబ్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, 39వ డివిజన్ కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి, న్యాయవాది నాలుగెస్సల రాజులు మొదటి రోజు శిబిరానికి వచ్చిన ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి కెటి కురియాకోస్ మాట్లాడుతూ థెరిస్సా క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఆర్అండ్‌బీ జంక్షన్ ప్రాంతంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో యువతకు మేలు

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలు రాలేదన్న టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేబీ నాయన ఆరోపణలను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఖండించారు. ఇదే విషయమై మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన టీడీపీ నేతలు అభద్రతాభావంలో పడి, ఎవరు ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇంత అభివృద్ధి చేస్తున్నా, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా ఏమీ చేయడం లేదని అనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు.

నేడు ‘వైఎస్సార్ ఆసరా’

భోగాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ అవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషరెడ్డి మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతోందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా మహిళలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ప్రజలకు అందుబాటులో సమగ్ర సమాచారం

రాజాం: అన్ని పంచాయతీ కార్యాలయాలతో పాటు అన్ని శాఖల కార్యాలయాల్లో ఆయా కార్యాలయాల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆయన సమాచార హక్కు చట్టంపై కలెక్టర్ సూర్యకుమారి అందించిన వివరాలను నోట్ చేసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ప్రజలు ఏ విభాగానికి సంబంధించి, సమాచారం ఎప్పుడు అడిగినా వెంటనే మనం ఇచ్చేలా ఉండాలని తెలిపారు. ప్రతీ సచివాలయంలో ఆర్‌టీఐ విభాగం ఉండాలని, ముందుగానే సమాచారం అందుబాటులో ఉంచి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు



మహిళల ఆర్థిక సంక్షేమానికి ‘ఆసరా’

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ(నెల్లిమర్ల): మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి వైఎస్సార్ ఆసరాను సద్వినియోగం చేసుకోవాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో డాక్టర్ వైఎస్సార్ ఆసరా మూడవ విడత నగదు విడుదల కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనిలో పాల్గొన్న పొదుపు సంఘాల మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే అప్పలనాయుడు ప్రసంగించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా మహిళల రుణాలు మాఫీ చేశారన్నారు. మాఫీ మొత్తంలో 75 శాతం మూడు విడతల్లో అందజేసినట్టు తెలిపారు. ఇప్పటికే మూడు విడతల్లో అందజేసినట్లు తెలిపారు. మిగిలిన ఒక విడత నగదును కూడా ప్రభుత్వం మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఆసరా పథకం ద్వారా అందుకున్న నగదుతో మహిళలంతా స్వయం ఉపాధిని పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మహిళలంతా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా 1082 స్వయం సహాయక సంఘాల్లోని 11,940 మంది మహిళలకు రూ.7.83 కోట్లు విలువైన ఆసరా చెక్కును ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ తదితరులు అందజేశారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములునాయుడు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ కె.వి. రమణరాజు, వైకేపీ ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న పొదుపు సంఘాల మహిళలు

ప్రభుత్వ భూములను గుర్తించాలి

డెంకాడ: డెంకాడ గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తించి, వాటిని రక్షించాలని డెంకాడ సర్పంచ్ పి. గౌరమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, వార్డు సభ్యులు కలెక్టరేట్‌లో ఇటీవల గ్రీవెన్స్‌లో విన్నవించారు. 3వేల ఎకరాలు సాగు భూములు, మెట్ట భూములు కలిగిన డెంకాడ రెవెన్యూలో ప్రభుత్వ భూములు అక్రమణలో ఉన్నాయని వివరించారు. మండలంలోనే అనేక గ్రామాలకు సాగు నీరు అందించే పెద్దకాలువ, కొమ్మురి అప్పడుదొర కాలువ, ల్యాండ్ సీలింగ్ భూములు, డి.పట్టా, ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. వీటిలో చాలా వరకూ పెద్దపెద్ద భూస్వాములు, రియల్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని తెలిపారు. దీంతో పాటు గతంలో రెవెన్యూ రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయ భవనాలకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు కూడా లభ్యం కాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. డెంకాడ గ్రామంలో రెవెన్యూ రికార్డులు ఆధారంగా మొదటిగా ప్రభుత్వ భూములను సర్వే చేసి వాటిని రక్షించాలని కోరారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: మండల స్థాయి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులు చిరుధాన్యాలు పండించేలా ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చిరుదాన్యాల సాగు పెంచేందుకు తీసుకున్న చర్యలను ఏఓ పూర్ణిమ వివరించారు. బర్లపేట, పూతికపేట, బూరాడపేట, పారసాం గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. గ్రామాల్లో బాల్య వివాహాల నివారణకు స్థానిక ప్రజాప్రతినిధులు సమాచారం అందించి సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కోరారు. సమావేశంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.